# పసిగుండె

## "కొలకలూరి"

కటికి చీకటి.

కుండపోతగా వాన.

హోరుగాలి.

కిటికీ చెక్కల్ని, వాకిలి తలుపుల్ని గాలి వూపూపి కొడుతూ వుంది.

వాన విసిరిసిరి కురుస్తూ వుంది.

ఆరిపోవాలో వెలగాలో తెలియక కొట్టుమిట్టాడుతున్న కోడిగుడ్డు దీపం చీకటికి దిద్దిన బొట్టులాగా వుంది. గాలి ఈలకి కన్ను కొడుతూ వుంది.

వానలో హోరులో చీకట్లో చేతిగడియారం ఆడుతూ వుంది. తొమ్మిది గంటలకే అర్ధరాత్రిలాగా వుంది చీకటి.

చాపతోపాటు చుట్టిన బెడ్‌మీద గోడకానుకొని కిటికీ దగ్గర కూర్చున్నాడు సుధాకర్.

ఎదురుగా నాప బండలు పరచిన నేల. ఎర్రని ద్రవంతో గ్లాసు. వలిచిన గుడ్డు. అరటిపండు!

సుధ కిటికీలోంచి చూశాడు. చీకటి! హోరు! వాన! కరెంటు పోయింది. ఊరంతా చీకటి ముద్ద!

సుధ కళ్ళు మూసుకొన్నాడు. కోడిగుడ్డు దీపంలాగా వుంది ముఖం. కళ్ళు తెరిచాడు. ప్రేమగా, దయగా, జాలిగా, చీకటిని చూశాడు. గ్లాసు ఒక్క గుటక! గొంతులో కోడిగుడ్డు. వమల్లేదు. మింగలేదు. లోపలికి పోయింది కళ్ళవెంట నీళ్ళు. ముఖంలో ఉబ్బు, నరాల్లో పొంగు. వెంటనే అరటిపండు. సునాయాసంగా దిగింది.

నోట్లో గొంతులో పేగుల్లో ఇనపముళ్ళ గొలుసు లాగినట్లు నొప్పి! మంట! పోటు! నరాల్లో జ్వరం. తలలో తిమ్మిరి. తేలిపోయే కాళ్ళు. పీక్కుపోయే కళ్ళు. విరగ్గొట్టినట్లు వళ్ళు. కూర్చో బుద్ధిపుట్టలేదు. నిలబడటం ఇష్టంకాదు.

మంచో, చెడో చేయటం కొత్తలో కష్టమే! అలవాటు అయితే ఆ తోవవేరు. ఒకపని అనుభవమో, ఫలితమో తట్టుకోలేని వాళ్ళు సాధారణంగా ఆపని జోలికి పోరు. సుధకిది కొత్తగానూ లేదు, పాతగానూ లేదు. దేనికదే! మింగిందాకా కష్టమయింది. మింగిన తర్వాత కష్టంగా వుంది.

ఇప్పుడు సుధ గరళం మింగిన శివుల్లా గొంతు పట్టుకొని కూర్చున్నాడు. సారాయి తాగిన టాలాయి టూలాయి గాళ్ళులాగా చేతులూకాళ్ళూ పీక్కుంటున్నాడు శివుడు చచ్చేంత చావు అయినా తట్టుకొంటాడు. టాలాయి టూలాయిగాళ్ళు చావురాకపోయినా శివాలు తొక్కుతారు.

సుధ మామూలు మనిషి!

సుధ ఆలోచన ఈ పెద్ద పల్లె నుంచి బయలుదేరి పట్టణం చేరుకొంది. తను ఆ సంవత్సరమే చేరిన డిగ్రీ కాలేజి దాటింది. రాధ చదివే జూనియర్ కాలేజి చుట్టూ తిరిగింది. అత్తింటికి పోయి రాధ గదిలో చేరి కూర్చుంది.

రాధ యువతీకాదు, బాలికా కాదు. వోణీ వేసుకోవటమయితే చేతనయిందికాని చీరె కట్టుకోమంటే చుట్టుకోవటంకూడా రాదు. పదహారు సంవత్సరాలంటే ఎక్కువ. పద్నాలుగంటే తక్కువ. ఎనిమిదింటికే నిద్రవచ్చి ఆవులిస్తూ వుంది.

అత్తకుకూతురు ప్రాణం. లేకపోతే భాగవతం ప్రాణం. ఒక ప్రాణం ఆవులిస్తుండటంవల్ల రెండో ప్రాణంతో గొంతెత్తి అరుస్తూ వుంది అత్త.

అత్తకు తోడున్న ప్రాణి రాధ. భర్త పోవటం రాధ పుట్టటం ఒక్కటే ముహూర్తం! అత్తకు రాధకంటె ముందూ ఎవరూ పుట్టలేదు. తర్వాత పుట లేదనటం అనవసరం.

రాధవయస్సుకంటే అత్త వయస్సు ఇప్పటికి రెట్టింపు!

కడుపులో బ్లేడు పెట్టి కోసినట్లుంటే అత్తా, రాధల ముఖాన ఆలోచన తలుపుమూసి సుధ పేగుల్లోకి చూసుకొన్నాడు. తంటా! పేగులు కములుకు పోతున్నాయి.

సుధ కిటికీలోంచి చూశాడు. వానలో తడిసి ఈదురుగాలి! చీకటి వణికిపోతూవుంది. అప్పుడొకటీ, ఇప్పుడొకటీ మెరుపుకి క్షణంలో సగం వెలుతురు, ఆకాశం చిరిగినట్లు మెరుపు. ఓటికుండ లోంచి నీళ్ళొలికినట్లు వెలుతురు.

'రావు!'

సుధ పెదాలు స్పష్టంగా పలికాయి.

ఏమిటీ పదాలకర్థం! సుధకు తెలుసు!

మండేగుండె రాధను చుట్టుముట్టింది. కాంతివలయంమధ్య చంద్రబింబంలాగానో, పిడకల్లో కాలుతున్న రెండెడ్లబండి చక్రం పైనున్న ఇనపగాను మధ్య కాళీస్థలంలాగానో, రాధ కదలకుండా కాలకుండా కుసుకుతూ చలిగాచుకొంటున్నటుంది.

తండ్రి చెల్లెలు అత్తకావటం తప్పుకాదు. అత్త కూతురు వరసకావటం వింతకాదు. ప్రేమించినవాడు పెళ్ళాడతాననటం అన్యాయంకాదు.

కాని సుధవిషయంలో అంతా తారుమారు. గొడవ! రభస!

రాధతో సుధ పోయినేడు,

'మనం పెళ్ళి చేసుకొందాం'

నిక్కచ్చిగా చెప్పాడు.

'మనంవా?'

రాధ దిక్కు తెలియకుండా ప్రశ్నించింది.

'నిన్ను పెళ్ళి చేసుకొంటా'

'నన్నా?'

'ఏం?'

'నిన్నా?'

'ఏం?'

'పెళ్ళా?'

'ఏం?'

'ఎందుకు?'

'ఏం?'

'పెళ్ళెందుకు?'

'ఏంటి నువ్వనేది?'

'ఏం పెళ్ళి?'

'మన పెళ్ళి!'

'అమ్మనడుగు!'

వాళ్ళ సంభాషణలో సమాధానాలకంటే ప్రశ్నలెక్కువ. ఆలోచనకంటే ఆశ్చర్యం ఎక్కువ. అవసరంకంటే ఆతురత ఎక్కువ.

రాధ తల్లిచాటు పిల్ల. పెళ్ళిమాట ఇంకా శరీరంమీద పాకి గుండెలోకి చేరలేదు. మొదటిగా పెళ్ళిమాట వింటే అంతకంటే మాట్లాడలేకపోయింది. తెలియలేదు ఏం చేయాలో దిక్కు తోచకపోతే అమ్మ అండ వేరే అమాయిక! అంతే! అమ్మదగ్గరకుపోయి కూర్చుంది.

అత్తదగ్గరకుపోయి సుధ చెప్పాలనుకొన్న నాలుగుమాటలూ చెప్పి, అత్తను అనుమతి, ఆశీర్వాదం అడిగాడు.

అత్త ఆమధ్య నోరు తెరవలేదు. ఇప్పుడు తెరిచినోరు మూసుకోవటం మర్చిపోయింది. భూకంపం అయిందన్నంత ఆశ్చర్యం! అగ్ని పర్వతం బద్దలయిందన్నంత భయం! ఆ తర్వాత నోరు మూసుకొంది. తల తలుపు తీసింది. గదినిండా గాలి. ఆలోచన.

అన్న ప్రయోజకత్వం ఆమెకు అక్షరాలా తెలుసు. ఆ తండ్రి కొడుకే సుధ! అన్నమీద మమకారం! పరిస్థితులమీద ఉక్రోషం! ఉరుమురిమినట్లు చూచింది. పిడుగుపడ్డట్లు కదిలింది.

'నీ కప్పుడే ఏం పోయేకాలం! బొడ్డూడని పసిగుడ్డు! పెళ్ళా? అయ్యో! నీకు తలకాయుందా? ఇంత తొందరేం ముంచుకొచ్చింది? ఏనాటిమాట! అంతా సల్లగావుంటే అప్పుడు సూద్దాం—తెలిసిందా? ఆ చదువూ సట్టుబండలు—సరీగ్గా సదివి సావు'

ఇటువంటి మాటలు వడ్డించి కడుపునింపి సుధను సాగనంపింది.

సుధ నోట్లోంచి చొంగ వూరుతున్నట్లు కిటికీలోంచి వాకిట్లోంచి వాననీళ్ళు వస్తున్నాయి బార్లా తెరిచివున్న తలుపులూ, కిటికీలు వాన గాలి చీకటి రాకపోకలకు రాసాతలయ్యాయి.

రెండు చేతులతో పేగులు మెలివేసి పట్టుకొని, కిటికీ నాపబండమీద గడ్డం ఆనించి కిటికీలోంచి చీకటి న్యత్యాన్నీ, వాన హోర్మోనియంనీ, హోరుగాలి సన్నాయినీ చూస్తూ వింటూ గొణిగాడు.

'రావు!'

సరీగ్గా ఇటువంటిరాత్రే—సంవత్సరంక్రితం ఇంటరు సీనియర్లో ఉన్నప్పుడు—అత్త ఇంటినుంచి దురుసుగా తిరిగివచ్చిన రోజు రాత్రి రావు వచ్చేసరికి రూంలో సుధ తూలుతూ, పేలుతూ, నవ్వుతూ, దేవదాసులాగా, మజ్నూలాగా, మరో కొక్కిరాయిలాగా ఉన్నాడు. ఏమయిందిరా అంటే ఎనిమిది నిద్రమాత్రలు మింగానని గ్యారంటీగా చచ్చిపోతాననీ, సంతోషంగా చస్తున్నానని కూనిరాగాలుతీసి ఆనందించాడు. రాధతో పెళ్ళి కాకపోతే బతకటం వ్యర్థమన్నాడు. ప్రపంచంలో అత్తలుండకూడదన్నాడు. చావు ఎంత సుఖంగా ఉందో వివరించాడు. చావు తిమ్మిరి సరదాగా వ్యాఖ్యానించాడు. చావు గొప్పనిద్ర అన్నాడు. మెలకువగా ఉన్నంతసేపూ ప్రేమ పుట్టుపూర్వోత్తరాలు, దాని ఉన్నతత్వం అగాధత్వం సాంగోపాంగంగా విడమరుస్తున్న రావుకు బోధిస్తూనే వున్నాడు. మెలకువగా ఉన్నంతసేపూ మెలికలు తిరిగిపోతూ చేతికి దొరికితే ఒట్టు. రావు పడిన పాట్లు ఒకటి రెండా కావు. నా చావుకు నేనే కారణం అంటూ ఒక ప్రేమలేఖ రావు చేతుల్లో పోష్టుచేసి పరుపుమీద విలాసంగా వాలిపోయాడు.

స్పృహ తప్పిన సుధను హాస్పటల్‌కి తీసుకొనిపోతే రెండు రోజులు సమాధ్యవస్థ అనుభవించిన యోగీ దులవారు కళ్ళు తెరిచారు. ఎదురుగా రంభ! చుట్టూ దేవతలు! స్వర్గం! దేవేంద్ర భవనం!

'బావా!'

'ఎవరూ?'

'బావా!'

'ఎవరూ?'

'నేను బావా రాధనీ!'

'రాధవా?'

'ఆఁ!'

'రంభవు కావూ?'

'కాదు బావా రాధని!'

'కృష్ణుడేడి?'

'ఏమిటి బావా ఇది?'

'తప్పురాధా ఏడవకు! వెళ్ళు! కృష్ణుడితో పాటుండు!'

'బావా ?' అవురుమని ఏడ్చింది.

సుధను రావు పట్టుకొని కుదిపాడు.

స్వర్గం నేలమీదికి దిగివచ్చింది. హాస్పటల్ బెడ్ కనబడింది. దేవేంద్రభవనం మాయమయింది. దేవతలు పరారయ్యారు. రాధ అత్తకూతురయింది. చావురాలేదని తెలిసింది. అవురుమని ఏడవాలని పించింది. తన కలలన్నీ కల్లలయ్యాయి.

రాధ ఇంకేం ఏడుస్తుంది. అత్త మరేం గుండెలు బాదుకోదు. కాలేజికి సెలవు ఇవ్వరు! విద్యార్థులంతా హాస్పటల్ కో, రూంకోవచ్చి ఏడుస్తూ చూడరు. బాధపడుతూ బ్యాండుమేళంతో వీధులన్నీ వూరేగించి వల్లకాటికి తీసుకుపోరు. పవిత్ర ప్రేమికుల వరుసలో స్వర్గంలో కూచోలేడు.

ఎన్ని కలలు కన్నాడు. ఎంత ఆశపడ్డాడు. అంతా విఫల మయింది. ఛీ ఛీ చాతకాని బతుకు అని తిట్టుకొన్నాడు.

రాధ కళ్ళలో నీళ్ళు. చూస్తేకపోయాడు. మెల్లగా చేయి తో తుడిచాడు. రాధ అవురుమని ఏడ్చింది. ఏడుపు మానేసి అడిగింది.

'నాకోసం సద్దామనుకొన్నావా ?'

'ఆఁ!'

'నాకోసం ?'

'ఆఁ!'

'నిజ్జంగా ?'

'ఒట్టు !'

ఎంతో సంతోషంగా గాలి పీల్చుకొంది.

'నువ్ బలికాలంటే మనవేమి జేయాలి ?'

'నాతో పెళ్ళి!'

'నాకా ?'

'ఆఁ!'

'నీతోనా ?'

'ఆఁ!'

'పెళ్ళా ?'

'ఆఁ!'

'అమ్మిష్టం!'

ఇది మునుపటి సమాధానంకంటే ఏమంత గొప్పది కాదు. అమ్మ అనబడే అత్తయ్య మరదూత.

'అలాకాదు' అన్నాడు.

'మరి ?' ప్రశ్నించింది.

'ఏంటి నీయిష్టం ?'

'నాకిష్టం!'

'మరి పెళ్ళేప్పుడు ?'

'నీ యిష్టం!'

'ఇవాళే!'

'నీయిష్టం!'

'ఇప్పుడే!'

'నీయిష్టం!'

సమాధానాలు, అంగీకారాలు, ఇష్టాలు సంభాషణలో సంసంగా ఒదిగి కూర్చున్నాయి.

సుధ చనిపోతాడంటే ఎందుకు ఏడుపు వచ్చిందో, బతుక్కీ పెళ్ళికీ సంబంధం ఏమిటో, తను అన్నమాటలమీద అతనికెంత ఆశ పుట్టిందో, అక్కణ్ణుంచి అతని దుఃఖం ఎలావుందో రాధకేమీ తెలియదు. అర్థంకాని లెక్కను చేయలేక, తల బద్దలు కొట్టుకోలేక పుస్తకం మూసేసి పడుకొనే విద్యార్థినిలాగా హాస్పిటల్ సన్నివేశం సంభాషణ సినిమా, నవల, కథలలోలాగా సరదాగా గుర్తుపెట్టుకొంది. సహజంగానే మర్చిపోయింది. ఆ ఆలోచనేలేదు. ఆ అవసరమే రాలేదు.

ఆ సన్నివేశం ఆమెలో మార్పుతేలేదు. మర్చిపోకుండానూ చేయలేదు. అయితే ఆ మాటలన్నీ టేప్ రికార్డులోలాగా గుండెలో రికార్డు అయిపోతే భద్రంగా ఉంచుకొన్నాడు సుధ. అతడి గాలిమేడలకు ఈ శబ్దాలు పునాదిరాళ్ళు.

పెద్ద చప్పుడు! పిడుగుపడినట్లుంది. చెట్టుకొమ్మ విరిగి పడినట్లు, పక్కనెక్కడో పాతగోడ కూలినట్లు అనిపించింది.

మెరుపు మెరిసింది. నేలంతా నీళ్ళమీద తేలినట్లు తళుక్కుమంది. చీకటి తలలోనుంచి జారిపడ్డ మల్లెచెండులాగా మెరుపు!

కిటికీ వెలుపల చీకటి. వాన వాగై తోవ తెలియకుండా పరుగు.

హోరుగాలి చెట్టుకీ చేమకీ, గోడకీ, మేడకీ కొట్టుకొని కళ్ళు తిరిగి, వళ్ళు పగిలి, దిక్కులేని దానిలాగా ఏడుస్తూ పోతూవుంది. ఒకటే రొద! నస!

కిటికీ ఊచలు విరవటంకోసం తొంగిచూస్తున్న దొంగలాగా వెలుపలికి చూస్తున్నాడు సుధ.

'రావు!'

చపాతీలు తెస్తానని పోయాడు రెండుగంటలయినా రాలేదు. సినిమాకి పోయాడో ఏమో! టెంట్‌లో చాలా పాత సినిమా! జనం ఎగబడుతున్నారు! ఏం చూడాలి?

రావు ఇంటరు పోయి, ఇంటిపట్టునే ఉండక పట్టణంలోనూ చేరక, పల్లె వాళ్ళకు బస్తీ, బస్తీ వాళ్ళకు పల్లె అయిన ఈ వూళ్ళో ఈ గది అద్దెకు తీసుకొని చదువును కూర్చోబెట్టి, పడుకోబెట్టి చంపుతున్నాడు. ఈసారి పరీక్షల అంతుతేల్చుకోవాలని దృఢ సంకల్పం!

పరుగు పందెంలో ఆరంభంలో ముందు పరుగెత్తి క్రమంగా వెనకబడిపోయే ఆరంభ శూరత్వముండే ఆం ధుడిలాగా, బండి లాగ లేని ముసలి గుర్రంలాగా సుధ గుండె మొరాయించి యీలిగిలబడుతూ వుంది.

అసలే అలిసిపోయిన గుండె ఒంటెమీదికి చివరి గడ్డిపరకలా రాధ పడింది.

నిన్నకు నిన్న 'రాధతో నీకేం పని? పెళ్ళి? ఛీ పో' అని అత్త అంటే 'నువ్వెవరు? నేనెవరు? నీతో నాకేం మాటలు' అని రాధచెప్పి వెళ్ళిపోవటం తలుచుకొంటే చావే నయమనిపించింది. చావు ప్రయత్నం లేకుండా రాగలిగితే వెంటనే వస్తే బాగుండుననిపించింది

సుధ ఆ క్షణంలో చావు కోరుకొన్నాడు. మునుపు చావలేక పోవటం గుర్తుకు వచ్చింది. చెప్పరాని బాధ కలిగింది. ఆపుకోలేని ఏడుపువచ్చింది. ఎలా చావాలో దిక్కు తెలియకపోతే, దేవుళ్ళా రావు గుర్తుకు వచ్చాడు. అందుకనే పట్టణంనుంచి పల్లెకు మిత్రుని వెతుక్కుంటూ వచ్చాడు.

'ఏరా ఇలా వచ్చావ'ని మిత్రుణ్ణి రావు అడిగాడు.

'చావాలని వచ్చా'నన్నాడు సుధ.

'మా బాగా చచ్చావుగానీ' నన్ను చదువుకొని చావనీ' అని ప్రస్తకాలలో కూరుకుపోయాడు.

రావుని పుస్తకాల శిథిలాలలోంచి వెలుపలికి లాక్కువచ్చి సమయం దొరికినప్పుడల్లా అత్తా రాధా తనకు చేసిన, చేస్తున్న, చేయ బోతున్న అన్యాయాల అధర్మాల పట్టికలు చదివి, అందుకు ప్రతీకారంగా చావదల్చుకొన్న సంగతి చెబితే, తక్షణం రావు భయపడ్డా, చచ్చేవాడెవడూ చెప్పిచావడనీ, చావదల్చుకొన్నవాడు ఇంతదూరం వచ్చి చావడనీ, ఒకసారి చచ్చి బతికిన వాడికి మళ్ళీ చావ లేదనీ, నిర్ణయించుకొని పోరా పో అని చదువుకోవటమనే పురావస్తు ఖనన కార్యక్రమంలో తలబంటి మునిగిపోయాడు

మిత్రుడి దగ్గరనుంచి వస్తుందనుకొన్నంత కనీసం రావలసినంత సానుభూతి రాకపోయేసరికి సుధకి తలతీసేసినట్లయింది. ప్రాణం పైనే పోయినట్లు అనిపించింది. ఇంతకంటే చావే నయమనిపించింది. సుధ పొద్దున్నుంచి ఆలోచించాడు చావాలని నిర్ణయించుకొన్నాడు. కానీ నిరమ్మాత్మలతో పాతచావు చావటం ఇష్టం లేదు. రావు ఒకవేళ రక్షిస్తే, రాధ వస్తుంది. కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంది. నాకోసం చనిపోయావా అంటుంది. పెళ్ళాడతానంటుంది. ఆడేస్తుంది. అంతకంటే తనకేం అక్కరలేదు. ఒకవేళ తను చనిపోతే - చనిపోగలిగితే ఇంకేం—రాధలేకుండా బ్రతకటంకంటే చావటం నయం.

కాబట్టి, విషం కావాలి. వెంటనే చనిపోయేదిగా ఆ విషం ఉండకూడదు. రావు రక్షించటానికి అవకాశం ఇవ్వాలి. చనిపోవడం ఎంతహాయిగా, సుఖమయిన బాధగా వుంటుందో రుచి చూడాలి. చని పోయినా ఫరవాలేదు. బ్రతికినా ఇబ్బందేంలేదు. ఏమయినా తనకే మేలు!

రావు రావచ్చు. బ్రతికించవచ్చు. రాధతో పెళ్ళి కావచ్చు. నిజానికి అదే జరిగేది.

'రావు!'

గొణిగాడు సుధ. రాలేదురావు ఎదురు చూస్తుంటే నరాలు పీక్కుపోతున్నాయి కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. వళ్ళంతా పది నిండులారీలు ఒక్కసారిగా పోతుంటే ఊగుతున్న బిడ్జిలాగా జవజవ లాడుతూవుంది.

అంతుపట్టని చదువు, అర్థంకాని చదువు చదివిచదివి అలిసి పోయిన రావు ఆ గది వదలి ఎటయినా పారిపోయి రెండూ మూడూ గంటలు తిరిగి వద్దామనుకొన్నాడు. వాన ఒకటి పీడగా దాపురించింది. తనకీ సుధకీ చపాతీలు తెచ్చుకోవటం కోసమే బయలుదేరాడు కాని అంత తొందరగా తిరిగివద్దామన్న ఉద్దేశంతో మాత్రం బయలుదేర లేదు. అడిగితే వెంటనే వస్తాననీ చెప్పాడు కానీ అదీ ఉద్దేశ పూర్వకంగా చెప్పిందికాదు యధాలాపంగా అన్నాడు.

'రావు!'

తోవలో మొదలయిన జల్లు రైల్వేస్టేషన్ దగ్గర రైలుకట్ట దాటిపోబోయేముందు ఎక్కువయింది. తడవటం ఎందుకని స్టేషన్ లోకి దారితీశాడు రావు స్టేషన్ అంతా తడిసి ముద్దయింది ఏ.ఎస్. ఎం కూర్చున్న గదే బుక్కింగు ఆఫీసు. ఇక మిగిలిన గదే వెయిటింగు రూం.

వెయిటింగ్ రూం నిండావున్న జనం రైలుకోసం వచ్చినవాళ్ళు కారు వాళ్ళు వాన తగ్గితే ఊళ్ళోకి పోతారు. ఒక పక్క గోడకు ఆనుకొని నిలబడ్డారు. వాన విదిలించి విదిలించి కొడుతూవుంది జల్లు గదిలో పడుతూవుంది. రావు గోడకు ఆనుకొని నిలబడ్డాడు.

ఎదురుగా సుందరి!

రావు ఆశ్చర్యపోయాడు. అప్పుడు సుందరిని అక్కడ చూస్తానని రావు అనుకోలేదు. ఏడో తరగతిదాకా కలిసి చదువుకొన్నారు. ఇంతలో ఇద్దరు పిల్లల తల్లి. పెద్దది సుందరి చీరపట్టుకొని నిలబడి వణుకుతూ వుంది. చంటాడు సంకలోంచి లోకం చిద్విలాసం చూస్తూ ఆశ్చర్యపోతూ వున్న నోరు తెరవని యోగి.

సుందరి ఒకమూలకు ఒదిగి నిలబడింది. కూర్చుందామంటే నేలంతా తడి. బీడీపీకలు, చుట్టముక్కలు, బఠానీ పొట్లాలు, వేరుసెనక్కాయ తొక్కలు, కాగితం తుంపలు, పారేసిన విస్తరాకులు, కాల్చిన అగ్గిపుల్లలు, కాళ్ళ ఇసుక, దుమ్ము, చెమ్మ, గది కంగాళీగా వుంది.

రావు జనంలోంచి చొరబడి, నెట్టుకొంటూ తోసుకొంటూ, పడుతూ, లేస్తూ, బతిమాలి, కోప్పడి, తిట్టి, తిట్టించుకొని సుందరివున్న ఆ మూలకు చేరాడు

'సుందరీ!' పిలిచాడు.

ఆమె రావును తప్ప అందర్నీ చూసింది.

మళ్ళీ పిలిచాడు.

నువ్వెవరివి అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది. 'నేను రావుని' పరిచయం చేసుకొన్నాడు. ఆమె గుర్తు పట్టింది. రావు ఎంతెత్తు పెరిగాడూ అని ఆశ్చర్యపోయింది,

రావుకి పక్కనున్న సుందరి ఎంతో ఎత్తులో వున్నట్లు అనిపించింది. ఇద్దరి పిల్లల ఎత్తూ బరువూ ఆమె ఎత్తూ బరువుగా అనిపించాయి. లెక్కలు రాకపోతే తలగోక్కుంటూ ఏడుస్తూ చెప్పించుకొనేది. కసిరితే ఏడ్చేది. వద్దుపొమ్మని మండిపడ్డా వెంటబడి ఇంటిదాకా వచ్చేది. తిడితే నవ్వేది. అంతా తనమీద ఆధారపడ్డట్టుండేది. ఏదో అధికారం సందుదొరికితే చెలాయించేది. అంత అమాయిక ఎంతగా మారిపోయింది!

ఇద్దరు పిల్లలతో ఉన్న సుందరి తనకు రాని లెక్కలు సునాయాసంగా చేసేసినట్లుంది. తనకు కూడా రాని ఇంగ్లీషు స్టోరీ కంఠతా పట్టేసినట్లుంది. తనకు తెలియని రహస్యం విద్య చదువు తెలిసినట్లు, పొందినట్లు, నేర్చినట్లు ఉంది. సృష్టిరహస్యం దానికి టీకాతాత్పర్యంతనకుపూర్తిగా వచ్చినట్లు, ఇక మాటేమారుమూల్కులు వచ్చేసాయన్నట్లు కనిపించింది. తనని చుట్టుకు తిరిగిన సుందరి అయిదేళ్ళలో తనకు అర్థంకాని సుందరి అయిపోయింది. సుందరిలో తెలియని, అర్థంకాని, అస్పష్టమైన ఆకర్షణ ఏదో అతన్ని ఆమె దగ్గరగా నిలబెట్టింది.

సాయంకాలం రావలసిన రైలు రాత్రయినా రాలేదు. ఈ వానలకు ఎక్కడ ఏం జరిగిందో, ఎప్పుడు వస్తుందో! పుట్టింటినుంచి అత్తవారింటికి పోతున్న సుందరి తన పల్లెనుంచి వచ్చి పట్టణం రైలురాక ఇక్కడ ఉండిపోయింది. రైలు టైంకివస్తే ఈపాటికి ఇంటికి చేరి వుండేది.

పిల్లవాడు ఏడిస్తే తీసుకపోయి పాలు తాగించి తీసుకు వచ్చాడు సుందరి తింటానికి ఏమయినా కావాలంటే చపాతీలు తెచ్చి ఇచ్చాడు. పిల్ల నిద్రకుపడితే నేలంతా తుడిచిపడుకోబెట్టాడు.

వాన తగ్గింది. జనం ఊళ్ళోకి పోయారు. ఆ రైలుకి పోయే ప్రయాణికులు ఎవరూలేరు. వెయిటింగ్ హాలులో సంసారం పెట్టిన ఇద్దరు బిచ్చగాళ్ళు. ముసలి అవ్వ, రెండు కుక్కలు వీళ్ళకు తోడుగా వున్న ప్రాణులు.

వాన తగ్గినా గాలి ఆగలేదు. వాన పూర్తిగా తగ్గనూలేదు. సన్నగా పెద్దగా ఉండివుండి వాన పడుతూనే వుంది చలిగా వుంది.

వాళ్ళు పెద్దగా మాట్లాడుకొన్నదేంలేదు. చిన్నగా గొణుక్కుందీలేదు ఎదురెదురుగా నిలబడ్డారు. సిగ్గు పడుతూ నిలువెల్లా చూసుకొన్నారు. గంటలతరబడి మౌనయోగుల్లాగ నిశ్చలంగా ఉన్నారు. ఎప్పుడయినా సుందరి ఏమయినా అడిగితే 'ఆఁ!' 'ఊఁ!' అనిమాత్రం రావు సమాధానం చెప్పాడు. రావు ఏమయినా అడిగితే సుందరి తలతో, చేతులతో బదులు చెప్పింది.

రైలు రాలేదు. కాలం ఆగలేదు వాన తగ్గలేదు రావు నిలబడే వున్నాడు. సుందరి పైటకొంగు నెత్తిమీద వేసుకొంది. నిలిచే వుంది. పిల్లలిద్దరూ బుద్ధిమంతుల్లా నిద్రపోతున్నారు. కుక్కలు మునగర దీసుకొన్నాయి. అవ్వకు కునుకు పట్టింది. బిచ్చగాళ్ళు గురక పెట్టారు.

వాన పెద్దదైంది. వూపి వూపి కొడుతూ వుంది.

సుందరి నిలబడే వుంది.

రావు నిలబడే వున్నాడు.

'రావు!' మధ గొణగాడు.

కిటికీ ఆగకుండా కొట్టుకొంటూ వుంది. తలుపు ఊగుతూనే వుంది.

టెంట్‌లోంచి జనం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. సినిమా సరిలారో, ఆపారో! వాన హోరు చీకటి త్రిమూర్తుల్లా ముప్పేటన వేసుకుపోయాయి.

'రావు!'

సుధకు భయం పట్టుకొంది. రావు రాకపోతే తాను చనిపోతే ఏం లాభం? రాధకు తన త్యాగం తెలియాలి. ముగిసిన త్యాగం తెలిసినా ప్రయోజనంలేదు. చేయగలిగిన త్యాగం చేస్తున్నప్పుడే తెలియాలి.

బ్రతుకు సజావుగా ఉన్నంతకాలం చావాలని తీవ్రంగా అనిపించింది. చావు సమీపం ఉవుతుంటే బ్రతకాలనిపిస్తుంది! తనిప్పుడిలా బ్రతికి చావటం?

'రావు!'

బలంగా లేచినిలబడ్డాడు సుధ. తను చావరాదు. 'బతకాలి. రాధకోసం బ్రతకాలి.' తలుపు దగ్గరకు వెళాడు. వీధిలోకి నడిచాడు. ఊరంతా చీకటి రాట్నంలాగా తిరుగుతూవుంది. కాళ్ళు తేలిపోతున్నాయి. ముమ్మరంగా వాన! ఊపుగా జల్లు! వీధంతా నీళ్ళు! విపరీతంగా చలి! దట్టంగా చీకటి!

నల్లని బస్తీ ఉరఫ్ బస్తీ నల్ల చీకటిలో ముడుచుకొని పడుకొంది. వీధిలో మనుష్యులు లేరు.

సుధ హాస్పటల్‌కి పోవాలని సంకల్పం. వొట్లోంచి నురుగు ఎక్కువయింది. నాలుక పీక్కుపోతూవుంది. కాళ్ళు లాగుతున్నాయి. తల ఉంగరాలు తిరుగుతూ వుంది.

ఎవరో ఎదురయ్యారు. అడిగితే తెలిసింది. ఆ వూళ్ళో హాస్పిటల్ లేదు. ఇద్దరు డాక్టర్లున్నారు. ఒకరు వీధి చివర, రెండోవాళ్ళు పై వీధి మొగదల డిస్పెన్సరీలు పెట్టుకొన్నారు. ఆ సమయంలో వాళ్ళు డిస్పెన్సరీలలో ఉండవచ్చు. వర్షమని మానేసివుంటే చెప్పలేం!

హాస్పటల్ లేదన్నప్పుడు దాదాపు ఆగిపోయిన గుండె డాక్టర్లున్నారనగానే ఆడటం మొదలుపెట్టింది.

సుధ బలమంతా కూడదీసుకొని వీధి చివరకు చేరుకొన్నాడు. వానలో తడిసి ముసుగు పెట్టుకొన్న మనిషిలాగా నర్సింగ్‌హోం అనబడే గది వేపచెట్టుకింద చీకటితో మంతనాలు ఆడుతూ కూర్చుంది. పోయి చూస్తే తలుపు వేసివుంది. ఎంత తట్టినా ఎవరూ పలకలేదు. బాదినా తలుపు తీయలేదు. మోత ఎక్కువయిందేమో పక్కింటి మనిషి బైటికి వచ్చాడు.

'ఎవడాడు?' ప్రశ్నించాడు.

'నేను! సుధని-అదే దిక్కులేనివాణ్ణి-డాక్టరుకోసం చావుబ్రతుకులో ఉన్నాను' కష్టపడి చెప్పాడు.

పక్కింటి మనిషి మూడు ముక్కల్లో చాలా సంగతి చెప్పాడు. డాక్టరుకి ఏభయ్యేళ్ళు! పిల్లలేరు. అయితే ఈమధ్య లేక లేక నెల తప్పింది. ఎక్కిన కొండ ఎక్కకుండా, మొక్కిన దేవుడికి మొక్కకుండా, మునిగిన గంగలో మునక్కుండా, డాక్టరు పూజలు చేయలేదుకాని చూపిన డాక్టరుకు చూపకుండా, తిరిగిన హాస్పటల్‌కి తిరక్కుండా, పోయినవూరికి పోకుండా వైద్యసదుపాయం చేయించాడు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదంటారు. ఇంత పెద్ద డాక్టరు, ఇంటావిడకు పురుడు పోయలేకపోవటం పెద్దవింతే! వారం తర్వాత వస్తుందనుకొన్న పురుడు అర్జెంటుగా వారం ముందువచ్చి వారెంటు లేకుండా అరెస్టు చేసింది.

ఆ వూళ్ళో ఉన్న తన ప్రత్యర్థికు లేడాక్టరు ఎ రినాగమ్మ పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ! అందుకని, పట్నం తీసుకుపోవటానికి వీల్లేని పిలిస్తేని భార్యనీ, తను పురుడు పోయలేని వీల్లేని భార్యనీ, తనకు పోటీ డాక్టరయిన ఎ రినాగమ్మ దగ్గరకు తీసుకుపోలేని పోరాని భార్యనీ, బీదా బిక్కికి, దిక్కూ దివాణం లేనివాళ్ళకి. అలగావాళ్ళకి అనుప్రతి మంత్రసాని మంగమ్మ. ఆమె కొండంత బలంగా అండకావలసి వచ్చింది.

మంత్రసాని మంగమ్మ చేతులు కాళ్ళులాగా పట్టుకొని, విదిలించి కొడితే ఓర్చుకొని, డాక్టర్లంతా చేతకానివాళ్ళంటే నమ్మి నిజమని అంగీకరించి, తన డాక్టరికం ఎంత గొప్పదో ఆమెచేత చెప్పించుకొని ఒప్పుకొని, ఆమెని ఏ విషయంలోనూ కాదూ కూడదూ అనకుండా, ఆమె ఒత్తిన ఒత్తులన్నిటికీ ఓర్చుకొని, ఆమె ఆడమన్నట్లు అల్లా ఆడి, పాడమన్నట్లు అల్లా పాడి, మంత్రసాని మాటయిస్తే డాక్టరు కిట్టులాగా పట్టుకొని పాతసైకిల్ మీద పెట్టుకొని, రిక్షా తీసుకురమ్మంటే తీసుకువచ్చి, టాప్ వేయమంటే వేసి, తన మువలి సైకిల్ రిక్షాతో పోలేక వెనకబడితే ఆమె కసిరితే సరేనని, ఇంటికి ఆమెను చేర్చి, తాను సురక్షితంగా చేరి భార్య బాధనీ, మంత్రసాని మంగమ్మను మరో అధ్యాయంలో భార్య పడుతున్న నొప్పులకు అప్పజెప్పి, వరండాలో నిక్లైక కథానాయకుళ్ళా పచారు చేస్తూవున్న డాక్టరు పింఛను పుచ్చుకొన్న కలెక్టరు పోజు పెడుతున్నాడు.

అందువల్ల హాస్పటల్‌కి రాలేదు.

అంతా తెలిసిన పక్కింటాయన అటూ ఇటూ అవుతున్న సుధను తేరిపార చూసి ఎందుకొచ్చిన బెడద అని తపీమని తలుపు వేసుకొన్నాడు.

పక్క వీధి మొగదలదాకా తాను పోగలిగితే ఎంత బాగుండును. దేవుడిమీద నమ్మకం పెరిగింది సుధకు కాళ్ళు నీళ్ళలో తడుస్తుంటే కళ్ళలో నీళ్ళు వుడుతున్నాయి. పెరుగుతున్నాయి. వాగయి పెక్కిరి మైదానంలో చిమ్మించి కొట్టాయి.

డాక్టరు ఆనందరావు క్లీనిక్ చేరేసరికి గగనమయింది. తలప్రాణం గాలిలో కలసినట్లు అయింది. సుధ మెట్లు ఎక్కుతుంటే డాక్టరు ఆనందరావు దిగటానికి మెట్లవైపు వస్తున్నాడు.

ఆనందరావు హస్తవాసి మంచిది. మూడేళ్ళలోనే ప్రాక్టీసు ముమ్మరమయింది.

తనొక్కడే, క్లినిక్ ప్రారంభించినప్పుడు అన్ని పనులూ చేసుకొనేవాడు. ఇప్పుడొక కాంపౌండరు, నర్సు ఉన్నారు. కొద్ది రోజుల్లో తన క్లినిక్కి పక్క బిల్డింగ్ కట్టించుకోవాలని చూస్తున్నాడు. ఇంకా ఇద్దరు నర్సులను, కాంపౌండర్లను చేర్చుకోవాలని చూస్తున్నాడు.

ఈ విధంగానే ప్రాక్టీసు రోజురోజుకీ పెరుగుతూ వుండటం, దేవుడిదయవల్ల ఈవూరికింకా హాస్పటల్ లేకపోవటం ఇంకా కొంత కాలందాకా రాకపోతే, ఇప్పుడు కట్టించబోయే పదిబెడ్‌ల హాస్పటల్ ఎంతగానయినా పెంచటానికి వీలుండటం ఆనంద రావుకు సంతోష సంగతులు.

ఊరు ధ్యలో రెండెకరాల కాళీస్థలం కొనుక్కోగలిగాడు. ఆలోచనల్లో భవిష్యత్తును భద్రంచేసుకొంటున్నాడు.

ఆ చుట్టు పక్కల పల్లెలకు డాక్టరు లేడు. ప్రైమరీ హెల్త్ సెంటర్ కొండకవతలవుంది. అది దాటిపోవటం, రావటం ఈపల్లెల కింకా అలవాటు కాలేదు. ఆ ఏర్పాటు జరగలేదు.

పట్టణాలలోనేకాదు పల్లెల్లోనూ నానాటికీ రోగాలు పెరుగు తున్నాయి. జనానికి పాతమందులమీద. పల్లె వైద్యంమీద రోత పుట్టింది. పట్నా డాక్టరు మీద మోజు పెరిగింది. డాక్టరు ఆనంద రావు మొదట్లో దిగాలుపడ్డా, దిన దిన ప్రవర్ధమానంగా పెరుగు తున్న రోగుల్నిచూసి ఆనంద పరవశుడవుతున్నాడు. రోగంతో జనం అరుస్తుంటే, తన్నుకులాడుతుంటే ఎక్కళ్ళేని సంతోషంతో ఆనంద రావుకూపిరి తిరగదు. ఆనందరావు అదృష్టమో, రోగుల దుర దృష్టమో వాళ్ళు రోగంతో చిరంజీవులవుతున్నారు. చేతినిండాపని, చేసినంత సంపాదన. డాక్టరు ఆనందరావు రోజూ రోజుకీ దర్జా ఆనందరావు అయిపోతున్నాడు.

అంతకుముందే కాంపౌండరుని పూలు తెమ్మని పంపాడు డాక్టరు ఆనందరావు. నర్సు ముందే వెళ్ళిపోయింది. తలుపుకు తాళం వేయబోతున్నాడు. ఎప్పుడయినా కాంపౌండరు రావచ్చు. పూలు తేవచ్చు. తను స్కూటర్ స్టార్ట్ చేయవచ్చు.

పూలూ, ఇల్లూ గుర్తుకువస్తే ఆనందరావుకు కాలునిలవదు కాలుగాలిన పిల్లిలాగా తిరగడు. ఊగిపోతూ వుంటాడు. పూలవాసన గుర్తుకువస్తేనే ప్రైప్రాణం పైనే పోతూ వుంటుంది.

ఆనందరావు సుధనుచూసి ముఖంలోని ప్రశ్నను కనుబొమల్లో పడేసి నిలబడ్డాడు.

'విషం తాగాను. బతికించండి'

ఆనందరావుకు అర్థంకాలేదు. రెండు క్షణాలు కనుబొమలు ఆలాగేవుండిపోయాయి. క్వశ్చన్ పేపరులోని ప్రశ్నలేవీ అర్థంకాని విద్యార్థిలాగా వున్నాడు డాక్టరు.

'మీకు దణ్ణం పెడతాను. నన్ను బతికించండి.'

'వీల్లేదు. నేను పోవాలి' ఆనందరావు ముందుకు వచ్చాడు.

'నేను బతకాలి! బతకాలి!' సుధ అరుస్తున్నాడు.

నర్సులేదు, కాంపౌండరు లేడు. పూలువస్తాయి. ఇల్లుంది. పోవాలి. డాక్టరు ఆనందరావు నిలబడలేకపోయాడు. ముందుకు సాగాడు.

సుధ వెర్రివాళ్ళా వున్నాడు. డబ్బాదస్కం వున్నట్లు కనపడటంలేదు. వెంట ఎవరూలేరు. అగినా లాభసాటి పనిగా లేదు. ఎందుకొచ్చిన ఆయాసం. పోవాలి. డాక్టరు ఆనందరావు కదిలాడు.

సుధ వాకిట్లో అడ్డంగా నిలబడ్డాడు. 'నేను బతకాలి బతకాలి' ఏడుస్తున్నాడు.

ఆనందరావు ఆగాడు. అర్థ ధర్మం చెలామణి అవుతున్న కాలంలో దేవతలెవరో పారేసుకొన్న గుండెకాయముక్క పడిన నేలలోని మట్టి తన శరీర నిర్మాణంలో ఏ మాత్రమో కలిసివుంటుంది. దయ లాంటిదేదో గుండెలో తళుక్కుమంది.

పోనీ ఆగితే, మందువాడితే, కుర్రాడు బతికితే - రెండు క్షణాలు గడిచాయి.

తనకేం లాభం ?

లాభంలేని పని ప్రపంచంలో ఏప్రాణీ చేయదు. తనెందుకు చేయాలి. డబ్బురాదు! పోనీ కీర్తి వస్తుందా? ఏమో! ఏమవు తుందో! ఇతనికి విషం ఎవరయినా ఇచ్చారో, తనే తాగాడో! ఏం ప్రమాదమో! వెళ్ళాలి.

పూల సువాసన నసాళం అంటేటట్లు తగిలినట్లు అయింది. ఆనందరావు నిలబడలేక పోయాడు. పోవాలి. బయలుదేరాడు.

సుధ డాక్టరు కాళ్ళమీద పడ్డాడు.

మళ్ళీ ప్రాచీన దేవతల గుండెకాయ వాసన! ఆగాడు, మేలు లేకపోయినా కీడు రాకపోతే ఫరవాలేదు. బతికితే దేశజనాభాలో ఒక ప్రాణి తగ్గదు. చస్తే ఎవరో, ఏవూరో, ఏమో! కోర్టు పోలీసులు సాక్ష్యం గోల! అంతవరకే అయితే ఫర్వాలేదు. ప్రాక్టీసు ఏమవు తుందో! మునలి పీనుగ అవకాశంచూసి ఏం ప్రచారం చేస్తాడో! కట్టబోయే హాస్పటల్, కొనబోయేకారు, రాబోయే నర్సులు, కాంపౌండర్లు, రోగులు అంతా నాశనం.

ముందుకు పోబోయే ఆనందరావుని సుధ గట్టిగా కాళ్ళు పట్టుకున్నాడు.

రాక్షసుల కోరల్లోని పదార్థం ఆనందరావు కాళ్ళ తయారీలో చేరింది. అందులోంచి జాలిరాదు. చెమటరాదు. చలనంలేదు. విదిలించుకొన్నాయి. కదిలాయి.

ఆ కుదుపుకు విషం తలకెక్కి తబ్బిబ్బు అవుతున్న సుధ ఆశ అడుగంటి చస్తున్న సుధ, బ్రతుకుమీద క్షణక్షణం మమకారం క్షీణించి పోతున్న సుధ, మూడు మెట్లమీంచి జారి రోడ్డుమీద పడ్డాడు.

వాన వూపూపి కొడుతూవుంది. ఈతలు మోతలుగా హోరు గాలి గొడవ పెడుతూవుంది. చీకటి గుండెలు బాదుకొంటూ ఏడుస్తూ వుంది.

తలుపులువేసి, తాళంవేసి, క్లీనిక్ మెట్లు దిగుతున్నప్పుడు కాంపౌండరు వచ్చాడు. స్కూటర్‌స్టార్ట్ చేసుకొని పూలుతీసుకొని ఆనందరావు వెళ్ళిపోయాడు.

నీళ్ళను చీల్చుకొంటూ, బెల్లు వాయించుకొంటూ, లైటు వేసుకొంటూ కాంపౌండరును మోసుకుపోయింది, రోడ్డుమీదపడ్డ సుధను చూడని సైకిల్.

సుధ లేచాడు. కొక్కెర తెగులు తగిలిన కోడి మెడలాగా తల నీలుగుతూవుంది. జాయింట్లు తొలగిన ఇనుం కడ్డీలులాగా కాళ్ళూ చేతులూ విటుపడితే అటే పోతున్నాయి. గొంతులోంచివచ్చే నురుగులో గురక తడిసి మొరటుగా మోగుతూవుంది. గుండె ఆడుతూ వుందో లేదోకాని తల చిందువేస్తూవుంది. అంతసేపట్లో ఆమాత్రం దూరంవచ్చి సుధ పడిపోయాడు.

మంత్రసాని మంగమ్మ కూర్చోమంటే కూర్చుని, నిలబడమంటే నిలబడి, రమ్మంటే దగ్గరకువచ్చి, పొమ్మంటే దూరంగాపోయి డ్రిల్లు చేస్తున్నాడు ముసలిడాక్టరు ఉరఫ్ పాతభర్త ఉరఫ్ కొత్త తండ్రి. భార్య అరుపువినబడితే శివం తొక్కుతున్నాడు.

స్నానంచేసి, భోజనంచేసి, పూలుజల్లి పూలుపెట్టి, చలిలో, వానలో, చీకటిలో మత్తు సువాసనతో మంచంమీద దొర్లుతున్నాడు. కుర్రడాక్టరు భార్య సన్నాయి నొక్కులకు వళ్ళంతా చిక్కుదారం ఉండలా చుట్టుకుపోతూ వున్నాడు.

సుందరిని చూస్తున్న రావు మాట్లాడకుండా అక్కడే, కదలకుండా, అలాగ్గే, సృష్టివిచిత్రాన్ని మళ్ళీ తల్చుకోకుండా, పనేమీ లేకుండా, ఊరికనే, ఆలోచన రాకుండా, నామూలుగా, ఏమీ పాలుపోక, ఏమీతోచక అక్కణ్ణుంచి పోబుద్ధి పుట్టక, సరదాగా కదలక ఊసుల్లేక, మెదలక నిలబడే వున్నాడు.

పట్టణంలో అమ్మ పక్కలో పడుకొన్న రాధ వళ్ళు నిక్కబొడుచుకొంటే చలిగాలి అని తలుపు వేసుకొని, నిద్రపట్టటంలేదని, అమ్మదగ్గరకు జరిగి, మరీ అతుక్కొని, కిటికీలోంచి, చీకట్లోంచి, వానలోంచి, గాలిలోంచి దూరంగా కనిపించని నక్షత్రాలు, వినిపించని అరుపులు, ఎదురుకాని దృశ్యాలు, లేని బొమ్మలు రానిభయం, ఉండలేని ప్రశ్నలు జవాబులు—కళ్ళుమూసుకొంది.

సుధ తోకతెగిన తాచులాగా కొట్టుకొన్నాడు. మెడకోసి వదిలితే ఎగిరే పశువులాగా పక్షిలాగా కొట్టుకొన్నాడు. కాళ్ళూ చేతులూ నాలుగు దిక్కులకూ చాచి చాచి నీళ్ళలో తపతపా కొట్టుకొంటున్నాడు.

అప్పుడొకరు ఇప్పుడొకరు వస్తున్నారు పోతున్నారు. కొందరు శబ్దం విన్నారు. కొందరు వినలేదు. విన్నవాళ్ళు కొందరాగలేదు, కొందరాగారు. ఆగినవాళ్ళు కొందరు చూశారు, కొందరు చూళ్ళేదు. చూసినవాళ్ళు కొంతమంది గొణిగారు. కొంతమంది మూల్గారు. ఒకళ్ళిద్దరు వెర్రికేకలు వేసి వెళ్ళిపోయారు. ఎవరూ నిలబడలేదు.

సుధ కాళ్ళూ చేతులూ ఆడించటంలేదు. ఎటు అంటే అటే పడేసి రోడ్డుమీద పడుకొన్నాడు. వాననీళ్ళు కాళ్ళమీదుగా తొడమీదగా గుండె, గొంతు దాటిపోతున్నాయి. ఎన్నినీళ్ళు మింగాడో, ఎన్ని నీళ్ళు ఉమిశాడో అతనికేం తెలియదు. తాగటం తాగకుండా ఉండటం అతనికేం నిమిత్తంలేదు.

అక్కడ వీధి వుంది. దానికేం పట్టదు. అక్కడ వూరుంది. దానికేం తెలియదు. నిండా మనుషులున్నారు. వాళ్ళకేం లెక్కలేదు. కుక్కలున్నాయి. పురుగులున్నాయి. తిరుగుతున్నాయి. గాలివుంది. వానవుంది. చీకటుంది. కదలికవుంది. రాత్రి వుంది. రోడ్డు వుంది. వూరు వుంది. సుధ ఉన్నాడు.

రాత్రంతా నొప్పలుపడి అరిచి అరిచి గగ్గోలెత్తిన ముసలిడాక్టరుభార్య తెల్లారుగట్ల పసికేక విని ఆనందంగా ఏడుస్తుంటే బట్టలూడిపోతున్న పెద్దడాక్టరు వరండా పొడుగూ వెడల్పూ తొరతొరగా కొలుస్తున్నాడు.

పూలు నలిగి, మంచం నలిగి, రాత్రి నలిగి, తెల్లారు జాము మునగర దీసుకుపోతే చిన్న డాక్టరు ముడుచుకొని మూడంకె వేసుకొని నిద్రపోయాడు,

రాత్రంతా రాని రైలు తెల్లగా తెల్లారినప్పుడువస్తే సుందరిని ఎక్కించి, పిల్లల్ని అందించి, సంచీ చేతికిచ్చి వస్తానంటే 'ఊఁ!' అని వెళ్ళిపోయిన రైలుని చూస్తూ నిలబడ్డ రావు కాసేపటికి తెప్పరిల్లి వెనక్కు తిరిగాడు.

కెవ్వున కేకవేసి దభీమని మంచంమీంచిపడి పీడకల అని గొణుగుతూ వణుకుతూవున్న రాధను కసిరి విసిరి మంచంమీద పడేసుకొని, కడుపులోకి లాక్కుని దుప్పటికప్పి నిద్రపోయిన తల్లిప్రక్క మేల్కొన్న రాధ!

తెల్లారేసరికి బ్రతుకు తెల్లారిన సుధ చేతి గడియారం మాత్రం ఆడుతూ వుంది.